న్యూఢిల్లీ, నవంబర్ 3 (చురకలు): ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే ఆ హక్కు పేరుతో ఇతరుల హక్కులకు భంగం కలిగించరాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో సుదీర్ఘంగా కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రాథమిక హక్కుల పేరుతో నిరసన ప్రాంతాలను నిరవధికంగా ఆక్రమించుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడింది. సమాజంలో ఇతర వర్గాల ప్రజలకు కూడా తమ సమస్యలపై గళమెత్తే హక్కు ఉంటుందని గుర్తించాలని సూచించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితవ–ుతున్నాయని వ్యాపార సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ముఖ్యంగా పండుగల సీజన్‌లో కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో నిరసనల వల్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. రహదారులపై ఆందోళనలు, రాకపోకలకు అంతరాయాల కారణంగా వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించాయి. దాదాపు 50 లక్షల మంది ప్రజలపై ఈ పరిస్థితుల ప్రభావం పడుతోందని వ్యాపార సంఘాలు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాయి. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరాయి. పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నిరసనలు నిర్వహిస్తున్న వారిని కూడా ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశించింది. ఆందోళన నిర్వాహకులను పిటిషన్‌లో భాగస్వాములను చేయకుండా వారి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల నిరసనకారులు, ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న వారి పేర్లను ప్రతివాదుల జాబితాలో చేర్చాలని పిటిషనర్లకు సూచించింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ఇతరుల జీవనోపాధి, రాకపోకలు, సాధారణ కార్యకలాపాలకు సంబంధించిన హక్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒక వర్గం తమ హక్కులను వినియోగించుకునే క్రమంలో మరో వర్గం ప్రజలు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తకూడదన్న అంశాన్ని ప్రస్తావించింది. నిరసనల నిర్వహణలో ప్రజల సౌకర్యాలు, శాంతిభద్రతలు, వ్యాపార కార్యకలాపాల మధ్య సమతుల్యత అవసరమని అభిప్రాయపడింది. మరోవైపు ఢిల్లీలో నిరసనల సందర్భంగా పెద్దఎత్తున వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం, పోలీసుల బలప్రయోగం, మెట్రో స్టేషన్ల మూసివేత, అంతర్జాల సేవల నిలిపివేత వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు విచారించింది. నిరసనల సందర్భంగా తీసుకునే భద్రతా చర్యలు, వాటి ప్రభావంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఈ వ్యవహారాల్లో సంబంధిత పక్షాల వాదనలు, ప్రభుత్వ వివరణలు కీలకం కానున్నాయి.



ఉపాధి హామీ పనుల్లో విషాదం కుప్పకూలి కూలీ మృతి



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 03, :

దుబ్బాక నియోజకవర్గం ఆకారం గ్రామంలో మంగళవారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఓ కూలీ అకస్మాత్తుగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అబ్రబోయిన పోచయ్య రోజులాగే ఉదయం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు హాజరయ్యాడు. తోటి కూలీలతో కలిసి పనిచేస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. తోటి కూలీలు వెంటనే స్పందించి సపర్యలు చేసేలోపే పోచయ్య మృతి చెందాడు. ఎండ తీవ్రత, గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబానికి ఆధారమైన పోచయ్య ఆకస్మిక మృతితో ఆకారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, తగిన ఆర్థిక పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అడిషనల్ అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డిని కలిసిన సాదుల పవన్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :



తెలంగాణ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డిని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మంగళవారం హైదరాబాద్ హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ రంగానికి సంబంధించిన పలు అంశాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇరువురు చర్చించారు. ప్రస్తుత న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులు, సామాన్య ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయడం, ప్రజా సమస్యల పరిష్కారంలో న్యాయపరమైన మార్గాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తేరా రజినీకాంత్ రెడ్డితో సమావేశం కావడం ఆనందంగా ఉందని సాదుల పవన్ కుమార్ తెలిపారు. న్యాయ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విలువైన అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టా సర్టిఫికెట్ల పంపిణీ



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 03, :

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టా సర్టిఫికెట్లను మంగళవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో 9వ వార్డు కౌన్సిలర్ వనం రమేష్, జీపీవో ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు పట్టా సర్టిఫికెట్లు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడంలో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు బత్తుల స్వామి, లోకనీ మల్లేశం, కోలబోయిన రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలి

- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలి
- 2026 డిశంబర్ 15 నుండి నిరవధిక సమ్మె



దుబ్బాక ప్రతినిధి (తొగుట), నవంబర్ 03, :

ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరుతూ సిద్దిపేట జిల్లా తొగుట మండలం తొగుట పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ రాధాకృష్ణకు ఆశా వర్కర్లు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు 28 వేల మంది గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, వీరంతా బడుగు, బలహీన వర్గాలకు ఆశాలు సేవలందిస్తున్నారనీ గర్భిణీలు ఆసుపత్రిలో డెలివరీ అయ్యే విధంగా చూస్తూ తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నారనీ తెలిపారు. దీంతోపాటు సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఆశా సెంటర్ డ్యూటీలు, ఏఎన్సీ, పిఎన్సి, టార్గెట్స్, ఎన్సిడి ఆన్లైన్ సర్వే, స్నాటమ్ డబ్బాలను మోయడం, ఎగ్జామ్ డ్యూటీలు, డ్రైడే, ఫ్రైడే, లెప్రసీ, పల్స్ పోలియో తదితర అనేక పనులు ఉదయం నుండి రాత్రి వరకు చేస్తున్నా ఏ సౌకర్యాలు లేవని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు రూ.18 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ఆశాలకు రూ.18 వేల ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల మట్టి ఖర్చులను వెంటనే నిర్ణయించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు చెల్లించాలని, పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని, ఏఎన్ఎం, జిఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు. లేని ఎడల 2026 డిసెంబర్ 15 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ప్రవీణ, పుష్పలత, లక్ష్మీ, శారద, భాగ్యలక్ష్మి , రాజకళ, శ్వేత, కవిత, సాజిద, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతే విద్యార్థి విజయానికి తొలి మెట్టు



దుబ్బాక ప్రతినిధి (నార్సింగి), నవంబర్ 03, :

అందమైన చేతిరాత ప్రతి ఒక్కరికీ సాధ్యమేనని, సరైన సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ఎవరైనా తమ చేతిరాతను మెరుగుపరుచుకోవచ్చని చేతిరాత శిక్షకులు ఎజాజ్ అహ్మద్ అన్నారు. మెదక్ జిల్లా నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచే లక్ష్యంతో మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాల ఆకృతి, పదాల మధ్య అంతరం, రాసే విధానం తదితర అంశాలపై శిక్షణ అందించారు. ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి సాధన చేయడం ద్వారా అందమైన చేతిరాతను అలవర్చుకోవచ్చని శిక్షకులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిచందర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతోపాటు స్పష్టమైన, అందమైన చేతిరాత కూడా ఎంతో ముఖ్యమని సూచించారు. విద్యార్థులు కేవలం విద్యా విషయాలకే పరిమితం కాకుండా మంచి నడవడిక, క్రమశిక్షణ, మానవీయ విలువలను కూడా పెంపొందించుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆశించిన లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేతిరాత శిక్షకులు ఎజాజ్ అహ్మద్ ను పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్ణచందర్ రావు, వెంకటేశ్వర శర్మ, దీప, రామకృష్ణ, పల్లవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఓటరు దరఖాస్తులను ఈ నెల 18లోపు పూర్తి చేయాలి

- బీఎల్వోలు, సూపర్వైజర్లకు ఆర్డీవో సదానందం ఆదేశం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

సిద్దిపేట పట్టణంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీవో సదానందం బీఎల్వోలు, సూపర్వైజర్లను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట పురపాలక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు, పురోగతిపై బీఎల్వోలు, సూపర్వైజర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సదానందం మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు, సూపర్వైజర్ల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించి ఇంకా ఏవైనా దరఖాస్తులు పెండింగ్లో ఉంటే వాటిని గుర్తించి ఈ నెల 18వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దరఖాస్తుల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ, నిర్దేశించిన గడువులోగా పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ సరస్వతి, సూపర్వైజర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

హైదర్ నగర్ అభివృద్ధికి నార్నె శ్రీనివాసరావు పాదయాత్ర

- అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటన
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 03, :

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్ కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు హైదర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు విద్యుత్, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి పర్యటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకొని డివిజన్లో అత్యవసరంగా ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ, సమస్యల రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అదేవిధంగా పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో హైదర్ నగర్ డివిజన్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ విద్యుత్ శాఖ ఏఈ మాధురి, లైన్మెన్ కాలి, జలమండలి మేనేజర్ విలియం ప్రకాష్, సూపర్వైజర్ నరేంద్ర, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్లో యూజీడీ సమస్యలపై బీఆర్ఎస్ నాయకుల పాదయాత్ర

- ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న వారాల వినోద్ కుమార్
- సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 03, :

సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్లో చాలాకాలంగా స్థానికులను వేధిస్తున్న యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ), డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ కౌశిక్తో కలిసి పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, హ్యాట్రిక్ విజేత కేపీ వివేకానంద్ గౌడ్ సూచనల మేరకు చేపట్టిన ఈ పాదయాత్రలో కాలనీలోని యూజీడీ, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిని పరిశీలించడంతో పాటు, సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులపై ప్రజలు తమ ఆవేదనను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు. సాయిబాబా నగర్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఈ పాదయాత్రపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, జహీర్, కావలి రవి, ముదిరాజ్ తదితరులతో పాటు స్థానిక ప్రజలు, మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ సర్వే వివరాలను యజమానులకు తప్పనిసరిగా తెలియజేయాలి

- అనుమానాలుంటే మరోసారి సర్వే చేసి సందేహాలు నివృత్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

భూ భారతి పథకం కింద చేపడుతున్న భూముల పునఃసర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, సర్వే పూర్తయిన వెంటనే భూ యజమానులకు సంబంధిత వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. సర్వే విషయంలో భూ యజమానులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా వాటిని నిర్లక్ష్యం చేయకుండా మరోసారి సర్వే నిర్వహించి వారి సందేహాలను పూర్తిస్థాయిలో నివృత్తి చేయాలని సర్వేయర్లకు స్పష్టం చేశారు. మంగళవారం బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ భారతి పునఃసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును, అధికారులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులకు భూ సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా భూ భారతి పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ముందుగా చిన్న గ్రామాలను ఎంపిక చేసి, అక్కడి భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం ద్వారా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా వీరాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశామని, గ్రామ పరిధిలోని మొత్తం 557 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, ఖాళీ బాటలను సర్వే చేసిన అనంతరం పట్టా భూముల సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టా భూముల సర్వే నిర్వహించడానికి రెండు రోజుల ముందుగానే సంబంధిత భూ యజమానులు, రైతులకు సమాచారం అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లైసెన్స్ సర్వేయర్లు, జీపీఓలు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోజుకు 35 నుంచి 40 ఎకరాల వరకు సర్వే పూర్తి



చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానికి కొలతలు, సరిహద్దులు సహా పూర్తి వివరాలను తెలియజేయాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే మరోసారి సర్వే నిర్వహించి స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. ఒకే భూ యజమానికి ఒకే ప్రాంతంలో పలు సర్వే నంబర్లలో భూములు ఉన్నట్లయితే భూ భారతి చట్టం ప్రకారం ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించే విధానం ఉంటుందని కలెక్టర్ వివరించారు. భూ యజమానులు, రైతులు పునఃసర్వే ప్రక్రియకు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. భూముల కొనుగోలు సమయంలో భూమి హద్దులు, విస్తీర్ణంపై ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముందుగానే తప్పనిసరిగా సర్వే చేయించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్వే అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు

- లేబర్ సెల్ కో-కన్వీనర్‌గా మద్దుల చంద్రప్రకాష్ రెడ్డి నియామకం
- నూతన బాధ్యతలు చేపట్టిన చంద్రప్రకాష్ రెడ్డికి వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందనలు



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 03, :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్ బీజేపీ లేబర్ సెల్ కో-కన్వీనర్‌గా ప్రశాంత్ నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మద్దుల చంద్రప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు చంద్రప్రకాష్ రెడ్డిని శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో, క్రమశిక్షణతో నిరంతరం పనిచేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త సేవలను పార్టీ గుర్తిస్తుందని, వారి శ్రమకు తగిన విధంగా బాధ్యతలు, అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

కుత్బుల్లాపూర్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

- పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకోవాలి
- తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 03, : తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, రానున్న హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం ఉషోదయ టవర్స్‌లో తెలంగాణ రక్షణ సేన మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం వీరేంద్ర



కుమార్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బాధ్యులు ఎత్తరి మారయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ముఖ్యంగా పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఓటరు నమోదులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ చామర్తి సీతారాం, బెంజిమెన్ పాల్, ఎల్.పి. రాజు, మనీష్ గుప్తా, మొండి సాయికృష్ణ, సన్నీ గౌడ్, షియాజ్ హుస్సేన్, సాయి, మురళి, షేక్ అమీర్, ఎండీ సిరాజ్, మొహ్సిన్‌తో పాటు తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో యాసంగి సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబర్ 03, :

ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులతో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మరోవైపు మురసు తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం 113వ ఎపిసోడ్‌లో మంత్రి ఈ సూచనలు చేశారు. ఈ సందర్భంగా సమీకృత వ్యవసాయం, ప్రకృతి సేద్యం, పురుగుమందుల సురక్షిత వినియోగం, తక్కువ నీటితో యాసంగి పంటల సాగుపై రైతులకు నిపుణులు అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరవ

- తాగునీటి బోర్ల మంజూరుకు కలెక్టర్ సానుకూలం..
- 22-A జాబితా నుంచి కాలనీల తొలగింపునకు హామీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 03, : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరవ చూపారు. చింతల్‌లోని రిడ్జ్ టవర్స్ వాసుల తాగునీటి సమస్యతో పాటు, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయనగర్, మారుతి నగర్ కాలనీలకు చెందిన సుమారు 400 కుటుంబాల 22-A భూ నిషేధిత జాబితా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ మనో చౌదరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రిడ్జ్ టవర్స్‌లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. కాలనీ ప్రతినిధులతో కలిసి మంగళవారం కలెక్టర్‌ను కలిసి, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన తాగునీటి బోర్ల మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, బోర్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

400 కుటుంబాలకు ఊరట కలిగించేలా 22-A సమస్యపై చొరవ

ఇదే సందర్భంగా విజయనగర్, మారుతి నగర్ కాలనీలకు చెందిన సుమారు 400 కుటుంబాలు ఎదుర్కొంటున్న 22-A నిషేధిత జాబితా సమస్యను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయా భూములను 22-A జాబితాలో చేర్చడంతో స్థానికులు తమ ఇళ్ల రిజిస్ట్రేషన్లు, ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజలకు ఏళ్లుగా ఇబ్బందిగా మారిన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత భూములను 22-A జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కలెక్టర్ మనో చౌదరి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత భూములకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, రెవెన్యూ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజల పక్షాన నిరంతరం పోరాటం



ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, కూన రాఘవేంద్ర గౌడ్, రిడ్జ్ టవర్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జనార్దన్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సురేష్, పవన్, చక్రి, రమేష్ బాబు, రంగారెడ్డి నగర్ డివిజన్‌కు చెందిన షకీర్, ప్రభాకర్ రెడ్డి, మల్లం శీను తదితరులు పాల్గొన్నారు.

సామాన్య కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే జారె

156 మంది బాధితులకు సీఎం సహాయ నిధి అందేలా ప్రత్యేక చొరవ



దమ్మపేట, నవంబర్ 03, :

అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేందుకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వైద్య ఖర్చుల భారం తగ్గించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 156 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు అవసరమైన మెడికల్ బిల్లులను మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ సచివాలయంలో సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్య చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

డంప్‌యార్డు నిర్వహణ లోపాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

- దీపావళిలోగా ఎంకేపల్లి గ్రామస్థుల సమస్యలు పరిష్కరించాలి
- అధికారులకు చింతా ప్రభాకర్ ఆదేశం
- చెత్త రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచన
- కలుషిత నీటితో చెరువులు, భూగర్భ జలాలకు ముప్పుపై ఆందోళన



సదాశివపేట, నవంబర్ 03, :

సదాశివపేట మండలం ఎన్కేపల్లి గ్రామ లో మంగళవారం నాడు డంప్‌యార్డు నిర్వహణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో పాటు గ్రామస్థులతో కలిసి డంప్‌యార్డును సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీపావళి పండుగలోగా గ్రామస్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.డంప్‌యార్డు నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్త రోడ్లపై పేరుకుపోతోందని, దీంతో కుక్కలు, పందులు, పశువుల సంచారం పెరిగిందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు, మహిళలు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. రోడ్లపై చెత్త కనిపించకుండా, మొత్తం వ్యర్థాలను డంప్‌యార్డు పరిధిలోనే వేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే వర్షపు నీటితో చెత్త నుంచి వెలువడుతున్న కలుషిత జలాలు సమీపంలోని రెండు చెరువుల్లోకి చేరుతున్నాయని, దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ రెండు చెరువులు గంగకత్వ కాలువ పరిధిలోని టెయిల్‌ఎండ్ చెరువులని పేర్కొన్నారు. కలుషిత నీరు చెరువుల్లో కలవకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యే ప్రమాదం ఉందని, ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎన్కేపల్లి చౌరస్తాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రయాణికుల భద్రత దృష్ట్యా అక్కడ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎన్కేపల్లి గ్రామ యువత, మాజీ సర్పంచ్ రాములు, శేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల సందర్శనకు బీఆర్ఎస్ నాయకుల సైకిల్ యాత్ర

- మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ మీదుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు యాత్ర

దుబ్బాక ప్రతినిధి (తొగుట), అక్టోబర్ 03, : తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన సైకిల్ యాత్ర తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చేరుకుంది. గోదావరిఖనికి చెందిన బిఆర్ఎస్ నాయకులు రవీందర్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ యాత్రకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యాత్ర నిర్వాహకులు మాట్లాడుతూ మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ మీదుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్రాన్ని సాగునీటి రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. అయితే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సైకిల్ యాత్ర ద్వారా ప్రాజెక్టుల నిర్మాణంతో కలిగిన ప్రయోజనాలు, సాగునీటి ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ప్రాజెక్టులపై అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని బీఆర్ఎస్ తొగుట మండల పార్టీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

- కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలి
- బెజ్జంకి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి పాఠశాలల నిర్వాహకులకు సూచించారు. బెజ్జంకి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన తయారీ, పంపిణీ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం, సాంబారు, మిల్ మేకర్ కూర నాణ్యతను పరిశీలించి, నిర్ణీత మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా? విద్యార్థులకు సరిపడా ఆహారం అందిస్తున్నారా? అని



సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా సరుకులు, కూరగాయలను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. వంటకాలు రుచికరంగా, పరిశుభ్రంగా తయారు చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి సరిపడా ఆహారం అందేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అనంతరం భోజనశాలలో విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్.. భోజనం రుచిగా ఉంటుందా? గుడ్డు ఇస్తున్నారా? సరిపడా పెడుతున్నారా? నిన్న ఏ కూరతో భోజనం చేశారు? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని, మంచి ఆహారం తీసుకుంటేనే శారీరకంగా బలంగా, మానసికంగా దృఢంగా ఉండి చదువుపై ఏకాగ్రత పెంచుకోగలరని సూచించారు. పాఠశాల వెనుకభాగంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడాన్ని గమనించిన కలెక్టర్ గ్రామపంచాయతీ సిబ్బంది నెలకొకసారి పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌కు సూచించారు. పాఠశాల వాతావరణం బాగుందని అభినందించిన కలెక్టర్, విద్యార్థులకు విద్య, భోజనం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ బొల్లం శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి

- ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి – ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- హఫీజ్‌పేట్, హైదర్‌నగర్ డివిజన్ల నాయకులకు దిశానిర్దేశం

శేరిలింగంపల్లి ప్రతినిధి, నవంబర్ 03, : అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హఫీజ్‌పేట్, హైదర్‌నగర్ డివిజన్ల ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులకు పలు సూచనలు చేశారు.

ప్రతి ఇంటి నుంచే ఓటరు నమోదు ప్రారంభం కావాలి

మన ఇళ్లలో ఉన్న పట్టభద్రులతో పాటు కాలనీలు, డివిజన్ల పరిధిలోని ప్రతి కుటుంబంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని శంభీపూర్ రాజు సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం మొదట మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు సైతం ప్రస్తుత నిబంధనల ప్రకారం తిరిగి నమోదు చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని తెలిపారు. గత పట్టభద్రుల ఓటరు జాబితాలను ఆధారంగా తీసుకుని అర్హులైన వారి వివరాలను సేకరించాలని, ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.



బీఆర్ఎస్ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడిన శంభీపూర్ రాజు, కేసీఆర్ నాయకత్వంపై ప్రజల్లో మళ్లీ ఆదరణ పెరుగుతోందని, తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ పాలన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు, యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలని అన్నారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు తన పరిధిలోని పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు చొరవ చూపాలని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, హఫీజ్‌పేట్, హైదర్‌నగర్ డివిజన్ల నాయకులు, సంబంధిత పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత



కుకునూరుపల్లి, నవంబర్ 03, : కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామానికి చెందిన ఏల మధు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుడికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ శిల్ప నర్సింలు, బ్యాంకు మేనేజర్ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిల్ప నర్సింలు మాట్లాడుతూ బీమా పథకాలు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, బ్యాంకు మిత్ర, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన మండల వ్యవసాయ అధికారి

- ఎరువుల దుకాణం అనుమతుల కోసం రూ.30 వేలు డిమాండ్
- మిగిలిన నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



సదాశివపేట, నవంబర్ 03, : సదాశివపేట పట్టణంలో ఎరువుల దుకాణం అనుమతులు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సదాశివపేట మండల వ్యవసాయ అధికారి రమేష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఎరువుల దుకాణం అనుమతుల కోసం ఓ బాధితుడిని వ్యవసాయ అధికారి రమేష్ రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా గత నెల 19న బాధితుడు రూ.10 వేలు చెల్లించాడు. మిగిలిన రూ.20 వేలను మంగళవారం అందజేస్తుండగా ముందస్తు సమాచారంతో మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలోని అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా లంచం సొమ్మును స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారి రమేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ ఘటనతో సదాశివపేట వ్యవసాయ శాఖలో కలకలం రేగింది. ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్
- రోడ్డు భద్రత ప్రమాణాలపై ఎస్పీ, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 03, : సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం సమీక్షిత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సిన చర్యలు, జాతీయ రహదారులపై రోడ్డు భద్రత మెరుగుదల పనుల పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

జిల్లాలో గత మూడు నెలలుగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ చేసి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వచ్చే వారం నివేదిక



సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను గుర్తించాలని సూచించారు. అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వేగ నియంత్రణ బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు భద్రత పనులకు అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, రాత్రివేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ సూచిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, చెవ్రాన్ మార్కర్లు, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, రోడ్ల వెంట అక్రమణలు తొలగించి అనధికార పార్కింగ్‌ను నియంత్రించాలని తెలిపారు.

ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ

మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం కారణంగానే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ఎక్కువగా గాయపడుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై ప్రాణనష్టం సంభవిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతివేగ నియంత్రణ చర్యలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి నియంత్రించేందుకు ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు అవసరమని, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఈ-చలాన్లు జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారులపై ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్ సేవలను జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రారంభించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంభా, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, రవాణా, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంభా, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు త్వరగా విడుదల చేయాలి

- గృహనిర్మాణ సంస్థ చైర్మన్ పీవీ గౌతమ్‌ను కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, నవంబర్ 03, : అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పెండింగ్ లో ఉన్న ఫైనల్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ పీవీ గౌతమ్‌ను కలిసి, మొదటి విడత ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల సమస్యలను వివరించారు. అర్హులైన పేదలకు ఇబ్బందులు లేకుండా పెండింగ్ చెల్లింపులు పూర్తి చేసి, సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ఎమినిటీస్ స్థలాల వేలాను వెంటనే రద్దు చేయాలి

- ప్రజావసరాల భూములను అమ్మితే సహించేది లేదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబర్ 03, :

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమినిటీస్ స్థలాలను ఖాళీ స్థలాల పేరుతో బహిరంగ వేలం ద్వారా విక్రయించడం సరికాదని, వెంటనే వేలం ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. హౌసింగ్ బోర్డు అధికారుల తీరు చూస్తుంటే రాబోయే రోజుల్లో పార్కు స్థలాలను కూడా మిగల్చేలా లేరని ఆందోళన వ్యక్తం చేశారు.లక్షలాది మంది నివాసం ఉంటున్న కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కనీసం ఒక్క పెట్రోల్ బంక్ కూడా లేదని, పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం లేఅవుట్‌లో కేటాయించిన భూములను సైతం వేలానికి పెట్టడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. జేఎన్‌టీయూ–హైటెక్ సిటీ రోడ్డులోని ఫోరమ్ మాల్ చౌరస్తా వద్ద ఉన్న 2,500 గజాల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, దానిని కమర్షియల్ ప్లాట్ పేరుతో వేలం వేసి విక్రయించేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమినిటీస్ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించనివ్వబోమని, అవసరమైతే స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. సుమారు యాభై ఏళ్ల క్రితం హౌసింగ్ బోర్డు లేఅవుట్ రూపొందించిన సమయంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఎమినిటీస్ స్థలాలను కేటాయించారని, ప్రస్తుతం కాలనీ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందడంతో ఆ స్థలాలు కూడా ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అరకొరగా ఉన్న ప్రజావసరాల స్థలాలను విక్రయించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని వివిధ ఫేజ్‌లకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేను కలిసి హౌసింగ్ బోర్డు భూముల వేలం అంశంపై చర్చించారు.



కాలనీ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే పార్టీలకు అతీతంగా అందరూ ఏకమై ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

మానకొండూర్/ఇల్లంతకుంట, నవంబర్ 03, : ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ పంటను మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఇల్లంతకుంట పీఏసీఎస్ చైర్మన్ ఊట్కూరి రమణారెడ్డి, సర్పంచ్ నవీన్ కుమార్, డైరెక్టర్ గుండా వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ శ్రీనివాస్, అధ్యక్షుడు ఎం. బాల్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- “యువర్ మనీ, యువర్ క్లిక్, యువర్ ఛాయస్” నినాదంతో అవగాహన కార్యక్రమాలు
- సైబర్ నేరాల నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టి ప్రజల్లో సురక్షితమైన డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మొత్తం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా “యువర్ మనీ, యువర్ క్లిక్, యువర్ ఛాయస్” అనే ప్రధాన ఇతివృత్తంతో, “పాస్ ది పేమెంట్ – వెరిఫై ది పర్సన్” అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ



మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే ముందు క్షణం ఆగి, డబ్బులు స్వీకరించే వ్యక్తి లేదా సంస్థ వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని తెలిపారు.ముఖ్యంగా ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా వస్తువులు, సేవలు అందిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసి వస్తువులు డెలివరీ చేయకుండా మోసాలకు పాల్పడటం, వ్యక్తిగత వివరాలను దొంగిలించి క్రెడిట్, డెబిట్ కార్డులను అనధికారికంగా వినియోగించడం, స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతూ నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో మోసం చేయడం వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల సూచనల మేరకు స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబరక్రైమ్.గోవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలువరించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణలో జిల్లాకు ఐదు ప్రశంసా అవార్డులు



- వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అభినందించిన కలెక్టర్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ, బాధితులకు నిరంతర వైద్య సేవలు, ఏఆర్టీ చికిత్స అందించడం, వైరల్ లోడ్ నియంత్రణలో జగిత్యాల జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు ఐదు ప్రశంసా అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు ఐదు ప్రశంసా అవార్డులు లభించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులందరికీ సకాలంలో ఏఆర్టీ చికిత్స అందించాలని, నిర్ణీత వ్యవధిలో వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించాలని, చికిత్స పొందుతున్న వారిని నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు అందించి సురక్షిత్ ప్లస్ స్థాయిని సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జి. సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ నరేంద్ర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, శ్రీ రవీంద్ర రాథోడ్ (డెమో సెక్షన్) తదితర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

మురసు తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

- ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులకు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు

ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

మురసు తుఫాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుఫాను ప్రభావంతో ఈ రాత్రి నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉన్నందున పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. తుఫాను ప్రభావంపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే భారీ వర్షాల నేపథ్యంలో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, పంటల రక్షణకు తగిన




ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

దుబ్బాకను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 03, :

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని, వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలు చవిచూస్తున్న రైతులను ఆదుకునేందుకు దుబ్బాక నియోజకవర్గాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి దుబ్బాక నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. వ్యవసాయాధారిత దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, దుబ్బాక మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్, తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, పలు గ్రామాల సర్పంచ్ లు, కౌన్సిలర్ లు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా
- ముధోల్ ఎంపీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- విద్యార్థులకు లెక్కల్లో మెలకువలు నేర్పించి, పెన్నులు బహుమతిగా అందజేత
- శిథిలావస్థ భవనం తొలగించి నూతన తరగతి గదుల నిర్మాణానికి హామీ



నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, :

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి ఒక్క విద్యార్థిపై ఉపాధ్యాయులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం ముధోల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను, తరగతి గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా మారిన పాత శిథిలావస్థ భవంతిని వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ శిథిల భవనం స్థానంలో విద్యార్థుల సౌకర్యార్థం నూతన అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ స్వయంగా ఐదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా బడికి రావాలని, ఎవరైనా తోటి స్నేహితులు పాఠశాలకు రాకపోతే వారిని కూడా వెంటబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు లెక్కలు సులభంగా అర్థమయ్యే మెలకువలను నేర్పిస్తూ బోర్డుపై కొన్ని గణిత సమస్యలను చేయించారు. ఇంగ్లీష్ పదాలను వ్యతిరేక క్రమంలో చదివిస్తూ వారి భాషా నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు చురుగ్గా సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ వారి ప్రతిభను ఎంతగానో అభినందించి, పలువురికి పెన్నులను బహుమతులుగా అందజేశారు. ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) భోజన్న, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవకుమార్, డీఎల్‌పీవో లక్ష్మణ్, సర్పంచ్ షబానా బేగం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఘనంగా కన్యకాపరమేశ్వరి 17వ వార్షికోత్సవం





దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 03, : కన్యకాపరమేశ్వరి 17వ వార్షికోత్సవాన్ని దుబ్బాక పట్టణంలోని వైశ్య భవన్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్క రించుకొని ఆలయంలో లక్ష పుష్పార్చన, లక్ష నామార్చన, అభిషేకం, పుణ్యాహవాచనం, గణపతి పూజ, మహిళలచే వాసవి పారాయణం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ వాస్తవ్యులు కొండ పద్మావతి చేత సౌందర్యలహరి ప్రవచన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దుబ్బాక వైశ్య సంఘం అధ్యక్షులు చింత నాగేందర్, కార్యదర్శి పడమటింటి రాజు, కోశాధికారి చింత ఉమామహేశ్వర్, ఆధ్యాత్మిక చైర్మన్ చింత శ్రీనివాస్, వాసవి మహిళ సంఘం అధ్యక్షురాలు చింత ఉమారాణి, అర్చకులు వేలేటి జయరామ శర్మ, రామకృష్ణ శర్మ,మహిళా సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కుక్కల బెడద

తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రజల విజ్ఞప్తి



గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 03, :

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ మితిమీరిపోతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు పట్టణంలో నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు రోడ్డు మీద నడవాలంటేనే జంకుతున్నారు. ఒంటరిగా బయటకు రావడానికి తీవ్రంగా భయపడుతున్నారు. కాలనీల్లో కుక్కలు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయో తెలియని భయానక పరిస్థితి నెలకొంది. మరోవైపు, వాహనదారులకు ఈ కుక్కలు పెద్ద ముప్పుగా మారాయి. రోడ్లపై వెళ్లే వాహనాలకు అడ్డంగా రావడంతో అదుపుతప్పి కిందపడి, ఎంతో మంది కుక్కల బారిన పడి తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన సందర్భాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు మరింత ఎక్కువవుతున్నాయి. ఈ తీవ్ర సమస్యపై మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు బ్లూ క్రాస్ సొసైటీ లేదా ప్రత్యేక సిబ్బందితో చర్యలు చేపట్టి, ప్రజలను, వాహన దారులను ఈ కుక్కల బారి నుండి రక్షించాలని పట్టణ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

లంచం డిమాండ్ చేసినా కేసు

- నగదు తీసుకోక పోయినా అరెస్టు
- తెలంగాణ ఏసీబీ కీలక హెచ్చరిక



హైదరాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, : ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే అధికారులపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొరడా ఝుళిపిస్తోంది. ఇప్పటివరకు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితేనే అరెస్టు చేస్తారనే అభిప్రాయం ఉండగా, ఇకపై లంచం డిమాండ్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీబీ స్పష్టం చేస్తోంది. డబ్బులు చేతికి అందకపోయినా లంచం అడగడం నేరమేనని తేల్చిచెప్పింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్‌ఇన్స్పెక్టర్ కొట్టూరు విజయ్‌పై ఏసీబీ క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసు నమోదు చేసి అరెస్టు చేసింది. ఓ ఫిర్యాదుదారుడి నుంచి మొదట రూ.10 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.లక్షకు బేరం కుదుర్చుకున్నట్లు ఏసీబీ విచారణలో వెల్లడైంది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన 524/2024, 525/2024 కేసులకు సంబంధించి ఫిర్యాదుదారుడిని అరెస్టు చేయకుండా ఉండటం, 41-ఏ నోటీసులు జారీ చేయడం, వాటికి సమాధానాలు స్వీకరించడం, అదే వ్యవహారంలో కొత్త కేసులు నమోదు కాకుండా చూడటం వంటి అధికారిక సహాయాల కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ కె వెంకటేశ్వర్లు, ప్రైవేట్ వ్యక్తి కాసారం రవీందర్ ద్వారా రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. పెట్రోల్ బంకుకు సంబంధించిన వెరిఫికేషన్ సర్టిఫికెట్, రోజువారీ విక్రయాల రిజిస్టర్ అందించేందుకు ఈ మొత్తం డిమాండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

లంచం అడిగినా నేరమే

ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేసినంత మాత్రాన అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఏసీబీ స్పష్టం చేస్తోంది. లంచం తీసుకున్నప్పుడే కాదు, డిమాండ్ చేసినట్లు ఆధారాలు లభించినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. అవినీతికి పాల్పడే అధికారులపై ప్రజలు ధైర్యంగా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది. ఈ పరిణామం ప్రభుత్వ శాఖల్లోని అవినీతి అధికారులకు గట్టి హెచ్చరికగా మారింది. కాగా ఈ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పేరిట తూతూమంత్రం

- కళామతల్లి సాక్షిగా గ్రామీణ ప్రతిభకు తీరని అన్యాయం
- సోమవారం రాత్రి ప్రకటన.. మంగళవారమే జిల్లా స్థాయి పోటీలా..
- నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు
- మండల, డివిజన్ స్థాయి వడపోత లేకుండానే ప్రైవేట్ స్కూల్ విద్యార్థులతో 'యువజన' సర్కస్
- ఏళ్ల తరబడి గజ్జెకట్టిన సీనియర్ కళాకారులకు మొండిచేయి
- భైంసా డివిజన్‌కు కనీస సమాచారం కరవు
- ఉత్సవాల నిధులు పక్కదారి పట్టించేందుకే ఈ దొడ్డిదారి తంతంటూ కళాకారుల తీవ్ర ఆగ్రహం





నిర్మల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 03, : స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాల (నేషనల్ యూత్ ఫెస్టివల్) ఆశయానికి నిర్మల్ జిల్లా యువజన, క్రీడల శాఖ (డీవైఎస్ఓ) అధికారులు నిలువునా తూట్లు పొడిచారు. క్షేత్రస్థాయిలో దాగి ఉన్న అద్భుతమైన యువ ప్రతిభను వెలికితీసి, గ్రామస్థాయి నుంచి జాతీయ వేదికల దాకా తీసుకెళ్లాల్సిన మహత్తర వేడుకలను కేవలం ప్రైవేట్ పాఠశాల నాలుగు గోడల మధ్య తూతూమంత్రంగా ముగించి చేతులు దులుపుకున్నారు. కనీస ముందస్తు ప్రణాళిక లేకుండా, నిబంధనలకు తిలోదకాలిచ్చి సోమవారం సాయంత్రం మొక్కుబడిగా ఒక ప్రకటన పడేసి.. మంగళవారం ఉదయానికే 'జిల్లా స్థాయి ఉత్సవాలు' నిర్వహించామంటూ ఫొటోలకు ఫోజులివ్వడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. గత మూడున్నర, నాలుగేళ్లుగా జిల్లాలో ఇదే అస్తవ్యస్త తంతు కొనసాగుతుండటంపై కళాకారులు, యువజన సంఘాలు మండి పడుతున్నాయి.

నిబంధనల ప్రకారం ఉత్సవాలు ఎలా జరగాలి

కేంద్ర, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ నిబంధనావళి ప్రకారం.. జిల్లా స్థాయి ఉత్సవాలు నిర్వహించాలంటే కనీసం రెండు నుంచి మూడు వారాల ముందే విస్తృత ప్రచారం కల్పించాలి. మండల స్థాయిలో గ్రామాల్లోని యువజన సంఘాలు, కళాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రాథమిక పోటీలు నిర్వహించాలి. అందులో గెలిచిన ఉత్తమ ప్రతిభావంతులను డివిజన్ స్థాయికి ఎంపిక చేయాలి. నిర్మల్, భైంసా లాంటి రెవెన్యూ డివిజన్లలో కఠినమైన వడపోత పోటీలు నిర్వహించిన తర్వాత.. ఆయా విభాగాల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన అసలైన విజేతలను మాత్రమే 'జిల్లా స్థాయి యువజన ఉత్సవాల'కు ఆహ్వానించాలి. అంతేకాకుండా ఈ ఉత్సవాల్లో పాల్గొనే వారి వయోపరిమితి సాధారణంగా 15 నుంచి 29 ఏళ్ల మధ్యలో ఉండి, ప్రధానంగా గ్రామీణ జానపద కళలు, నాటకం, శాస్త్రీయ సంగీతం, నృత్యం, వక్తృత్వం వంటి విభాగాల్లో నిష్ణాతులై ఉండాలి. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో ఒక్కో ఈవెంట్‌కు వేర్వేరుగా వేదికలు, వసతి, భోజన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతీ ఏటా లక్షలాది రూపాయల నిధులను విడుదల చేస్తుంది.

కానీ నిర్మల్‌లో జరిగిందేమిటి

మండల స్థాయి పోటీలు లేవు.. డివిజన్ స్థాయి సమీక్షలు అసలే లేవు. క్షేత్రస్థాయి పోటీల ఊసే ఎత్తకుండా, కనీసం నియోజకవర్గ కేంద్రాలకు, కళాశాలలకు ముందస్తు సమాచారం చేరవేయకుండా జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి (డీవైఎస్ఓ) శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో సోమవారం రాత్రికి రాత్రే ఉత్సవాలంటూ హడావిడిగా సమాచారం లీక్ చేశారు. మంగళవారం ఉదయం సోఫీనగర్‌లోని జేవీఎన్ఆర్ ప్రైవేట్ హైస్కూల్‌లో ఆ పాఠశాల విద్యార్థులను, కొద్దిమంది స్థానిక స్కూల్ పిల్లలను కూర్చోబెట్టి జిల్లా ఉత్సవాలను కానిచ్చేశారు. భైంసా, కుబీర్, ముధోల్, తానూర్, ఖానాపూర్, దస్తురాబాద్, కడెం వంటి సుదూర ప్రాంతాల కళాకారులకు ఉత్సవాలు జరుగుతున్నాయన్న సంగతి కూడా తెలియకుండా పోయింది. ఏదైనా ప్రైవేట్ బస్సులలో లేదా సొంత వాహనాల్లో వద్దామనుకున్నా ఒక్క రాత్రి వ్యవధిలో తయారై రావడానికి ఏ కళాకారుడికీ సాధ్యపడలేదు. ఫలితంగా గ్రామీణ యువతకు, భైంసా డివిజన్ పరిధిలోని ప్రతిభావంతులకు తీరని అన్యాయం జరిగింది. కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ఖర్చు రాసుకుని బిల్లులు చేసుకోవడానికే ప్రైవేట్ పాఠశాలలో ఈ తంతు నడిపించారన్న బలమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నష్టపోయింది ఎవరు.. కళామతల్లికి ద్రోహం కాదా..

ఈ అస్తవ్యస్త వ్యవహారంలో సర్వస్వం కోల్పోతున్నది క్షేత్రస్థాయి నిఖార్సయిన కళాకారులే. తెలంగాణ ఉద్యమ సమయంలో గజ్జెకట్టి, పల్లెపల్లెనా ధూంధాంలతో పాటలు పాడి సాంస్కృతిక చైతన్యం తెచ్చిన కళాకారులు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నారు. రెండు దశాబ్దాలుగా కళారంగమే జీవనంగా బతుకుతూ జాతీయ అవార్డులు సాధించిన సీనియర్లు ఎందరో ఉన్నారు. ఏటా ఈ యువజన ఉత్సవాల్లో పాల్గొని తమ శిష్యులను, గ్రామీణ యువతీయువకులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని వారు కనే కలలను అధికారులు కాలరాస్తున్నారు. కనీస పోటీ వాతావరణం లేకుండా, ఒకే పాఠశాల పిల్లలతో పాటలు పాడించి, నృత్యాలు చేయించి.. వారే జిల్లా విజేతలని, వారే రాష్ట్రస్థాయి పోటీల్లో నిర్మల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రకటించడం సిగ్గుచేటు. అసలైన జానపద కళాకారులు పోటీలో లేకుండా రాష్ట్రస్థాయికి వెళ్లే వీరు జిల్లా పరువును నిలపగలరా అని కళారంగ ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. గతంలో తాము వేదికలపై ఆడిపాడిన కొందరు కళాకారులు నేడు అధికారులుగా, ఉపాధ్యాయులుగా స్థిరపడినా.. ప్రస్తుత తరానికి సరైన వేదిక కల్పించడంలో "జడచిలుకల్లా" వ్యవహరిస్తూ చేతులు దులుపుకోవడం శోచనీయం.నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ప్రహసనంపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తక్షణమే స్పందించాలి. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల లెక్కలు, మండల స్థాయి పోటీలు నిర్వహించకుండా ఏకపక్షంగా జిల్లా పోటీలు నిర్వహించడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రైవేట్ స్కూల్లో మొక్కుబడిగా నిర్వహించిన ఈ ఫలితాలను రద్దు చేసి, భైంసా, నిర్మల్ డివిజన్లలోని అన్ని మండలాల్లో పారదర్శకంగా పోటీలు నిర్వహించి, అర్హులైన ప్రతిభావంతులను మాత్రమే రాష్ట్రస్థాయికి పంపాలని జిల్లా కళాకారులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.


ఎల్నినోను అడ్డుపెట్టుకొని హామీలను ఎగ్గొట్టి.. కరువు సృష్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

- కొట్టాల యాదగిరి, తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గం ఇంచార్జ్



గజ్వేల్ ప్రతినిధి నవంబర్ 03 :

తెలంగాణ రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ ప్రభుత్వం దాన్ని తీవ్రంగా ఉన్నట్టుగా ప్రజలను మభ్యపెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక హామీలను ఎగ్గొట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ కొట్టాల యాదగిరి ఆరోపించారు. అందులో భాగంగానే పంటలు వేయొద్దని నీటి కొరత ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నట్లు విమర్శించారు. మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, నిజంగా ఎల్ నినో ప్రభావం ఉన్నట్లయితే గజ్వేల్ నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు మండలాలుగా ఎందుకు గుర్తించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఏ రాష్ట్రంలో లేని ప్రభావం తెలంగాణలో అత్యధికంగా ఉన్నట్లుగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో నిత్యవసర సరుకులు ఆకాశాన్ని అంటడంతో పేద మధ్యతరగతి కుటుంబాలు కొనలేక తినలేక అల్లాడిపోతున్నారని, అధికారంలో ఉన్న మీరు ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి పరిస్థితులకు తగ్గట్టుగా ప్రణాళిక చేయకపోవడం వల్లనే పరిస్థితులు ఇలా ఉన్నాయని, ఇది మీ అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు భరోసా ఇచ్చి పేద మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉండి నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించక పోతే ఆకలి చావులు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు, పెరుగుతున్న ధరలపై నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని ప్రజల కొరకు పోరాటం చేయడానికి తెలంగాణ రక్షణ సేన సిద్ధంగా ఉందని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఇట్టి సమావేశంలో మాజీ ఎంపిటిసి ఎడ్ల నరసింహులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లింగని రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



భారత సాయుధ తిరుగుబాటు పితామహుడు ఫడ్కే

నేడు వాసుదేవ బల్వంత ఫడ్కే జయంతి

వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే... దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధు డు. శక్తివంత మైన బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునఃస్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరు నగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం. వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 -- 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్ధోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్ధోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణే నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్లు, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహిం చాడు. వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చు కొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగుబాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు. కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్ కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగు బాటు జరుగుతున్నది. వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లా లతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు. బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళు న్న ప్పుడు కలద్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు. ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువబడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాద కరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు. అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు.ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు. కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించా ల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

హనుమ పాత్రలో సజీవుడు జనార్ధన్

నేడు అర్జా వర్ధంతి



అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 – నవంబర్ 4, 2007) ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. ఆయన ఎక్కువగా పౌరాణిక చిత్రాలలో హనుమంతుడు వేషంతో మంచిపేరు సంపాదించు కున్నాడు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన నటన ఉండేది.

అర్జా జనార్ధన రావు 1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955)గా ఎన్నిక చేసింది. ఇతడు శబ్దగ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్ట్‌గా పనిచేశాడు. లవకుశ (1963); శ్రీకృష్ణావతారం (1967); వీరాంజనేయ (1968); శ్రీ రామాంజనేయ యుద్ధం (1974); ముత్యాల ముగ్గు (1975);శంకరా భరణం (1979); త్యాగయ్య (1981); శ్రీ ఆంజనేయ చరిత్ర (1981); దేవాంతకుడు (1984); తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభా వాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్లూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్.మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయకుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం. బాపు–ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజనేయ యుద్ధం. గతంలో గబ్బిట వెంకటరావు రాసిన పద్యనాటకం లోని పద్యాలను యధాతథంగా వాడడంతో సంభాషణలు కూడా అతని చేత రాయించారు. ఎన్టీఆర్ రాముడిగా, అర్జా జనార్దనరావు ఆంజనేయుడుగా, బి.సరోజదేవి సీతగా, ధూళిపాళ్ల యయాతిగా నటించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇందులో ఆంజనేయుడు ఆలపించే రెండు ఆర్ద్రమైన పాటలను వినూత్నంగా ఉంటుందని రఘురామయ్య చేత పాడించారు. వాటిలో మొదటిది 'రామ నీలమేఘ శ్యామా కోదండరామా' కాగా, రెండవది 'శరణు శరణయా జానకిరామా, కరుణ జూపవా మారుతిపై సాకేత సార్వభౌమా' అనే పాట. ఈ రెండవ పాటకు కె.వి. మహదేవన్ ఒక హిందీ పాట బాణీని అనుకరించడం వింతగా చెప్పుకున్నారు. అందుకు కారణం...మహదేవన్ ఎప్పుడూ ముందుగా ఇచ్చే బాణీకి పాట స్వరపరచ లేదు. కవి రాసిన ఎటువంటి పాటకైనా అద్భుతంగా బాణీలు కట్టటం మహదేవన్ నైజం. తద్భిన్నంగా 'సాకేత సార్వభౌమా' పాటకు మహదేవన్ అనుకరించిన హిందీ పాట 1964లో రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మాత తారాచంద్ బరజాత్యా సత్యన్‌బోస్ దర్శకత్వంలో నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం 'దోస్తీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే...ఫీర్ భి కభీ ఆబ్ నామ్ కో తేరే ఆవాజ్ మై న దూంగా' మహదేవన్ అనుకరించడాన్ని విశేషంగా చెప్పుకుంటారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆకాశమే హద్దుగా.. చరిత్ర సృష్టించిన ధీరవనిత!

భారత తొలి మహిళా ఎయిర్ మార్షల్ పద్మావతి బందోపాధ్యాయ

వైద్యురాలిగా ప్రస్థానం.. వైమానిక దళంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన వైనం

విమానయాన వైద్యరంగంలో విశేష సేవలు.. దేశ రక్షణకు అంకితమైన జీవితం

నేడు పద్మావతి బందోపాధ్యాయ జయంతి



ఆకాశమే హద్దుగా భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలు భారతదేశ చరిత్రలో ఎందరో ఉన్నారు. అయితే ఆకాశాన్ని జయించడమే కాకుండా దేశ రక్షణ రంగంలో మహిళల సామర్థ్యానికి కొత్త నిర్వచనం ఇచ్చిన అరుదైన వ్యక్తిత్వం పద్మావతి బందోపాధ్యాయ. భారత వైమానిక దళంలో ఎయిర్ మార్షల్ హోదాను అందుకున్న తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. వైద్యురాలిగా ప్రారంభమైన ఆమె ప్రస్థానం క్రమశిక్షణ, పట్టుదల, అపారమైన సేవాభావంతో దేశ రక్షణ వ్యవస్థలో అత్యున్నత స్థాయికి చేరుకుంది. మహిళలకు అవకాశాలు పరిమితంగా ఉన్న కాలంలోనే ప్రతిభకు లింగభేదం లేదని నిరూపించిన ఆమె జీవితం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం. నవంబర్ 4న పద్మావతి బందోపాధ్యాయ జయంతి సందర్భంగా ఆమె విశిష్ట జీవిత ప్రస్థానాన్ని స్మరించుకోవడం సముచితం పద్మావతి బందోపాధ్యాయ 1944 నవంబర్ 4న జన్మించారు. చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి, క్రమశిక్షణ, సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పం ఆమె వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. వైద్యరంగంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో ముందుకు సాగారు. దేశ రక్షణ వ్యవస్థలో వైద్య నిపుణుల పాత్ర ఎంత ముఖ్యమో గుర్తించి సైనిక వైద్య సేవలను తన వృత్తిగా ఎంచుకున్నారు. ఆ నిర్ణయమే ఆమెను భారత వైమానిక దళ చరిత్రలో ప్రత్యేక స్థానానికి చేర్చింది. 1962 భారత్–చైనా యుద్ధం దేశవ్యాప్తంగా యువతలో జాతీయ భావాలను బలపరిచింది. ఆ కాలంలో దేశ రక్షణకు సేవ చేయాలన్న ఆకాంక్షతో ఎంతోమంది యువత సైనిక రంగంవైపు ఆకర్షితులయ్యారు. పద్మావతి కూడా వైద్యవిద్య ద్వారా దేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో తన వృత్తి ప్రయాణాన్ని కొనసాగించారు. సైనికులకు వైద్యసేవలు అందించడం కూడా దేశ రక్షణలో అత్యంత కీలకమైన బాధ్యత అని ఆమె తన సేవల ద్వారా చాటిచెప్పారు. భారత వైమానిక దళంలో చేరిన పద్మావతి విమానయాన వైద్యశాస్త్రంలో ప్రత్యేక నైపుణ్యాన్ని సంపాదించారు. సాధారణ వైద్యానికి భిన్నంగా విమానయాన వైద్యం అనేక సవాళ్లతో కూడుకున్న రంగం. అత్యధిక ఎత్తులో ప్రయాణించే విమాన చోదకుల ఆరోగ్యం, శారీరక సామర్థ్యం, మానసిక అప్రమత్తత, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత వంటి అంశాలపై ప్రత్యేక పరిశోధనలు అవసరం. ఈ రంగంలో పద్మావతి విశేష సేవలందించారు. విమాన చోదకుల ఆరోగ్య పరిరక్షణ, విధి నిర్వహణ సామర్థ్యాల మెరుగుదల, వైద్యపరమైన భద్రతా ప్రమాణాల అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. వైద్య నిపుణురాలిగా ఆమె సాధించిన గుర్తింపు ఉన్నత బాధ్యతలను చేపట్టేందుకు మార్గం సుగమం చేసింది. పద్మావతి వృత్తి జీవితంలో 1978 సంవత్సరం మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఆ ఏడాది రక్షణ సేవల సిబ్బంది కళాశాలలో ఉన్నతస్థాయి కోర్సును పూర్తి చేసిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. సైనిక వ్యవస్థలో నాయకత్వం, వ్యూహాత్మక ఆలోచన, పరిపాలనా నైపుణ్యాలను పెంచే ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం ఆమె ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. మహిళలకు ఉన్నత సైనిక శిక్షణ అవకాశాలు పరిమితంగా ఉన్న కాలంలో ఆమె సాధించిన ఈ విజయం ఎంతోమందికి మార్గదర్శకంగా మారింది. సైనిక వైద్యరంగంలో పద్మావతి చేసిన సేవలు కేవలం వైద్య చికిత్సలకే పరిమితం కాలేదు. వైమానిక దళ సిబ్బంది ఆరోగ్య సంరక్షణ, శిక్షణ, పరిశోధన, వైద్య పరిపాలన వంటి అనేక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. వైద్యరంగంలో ఆధునిక పద్ధతులను వినియోగించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరచడం, సైనికులకు అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచడం వంటి అంశాల్లో తన నాయకత్వ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పద్మావతి బందోపాధ్యాయ జీవితంలో అత్యంత విశిష్టమైన ఘట్టం భారత వైమానిక దళంలో ఎయిర్ మార్షల్ హోదాను అందుకోవడం. ఈ స్థాయికి చేరుకున్న తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్రలో నిలిచారు. సైనిక వ్యవస్థలో ఉన్నత హోదాలకు మహిళలు చేరుకోవడం అరుదుగా ఉన్న కాలంలో ఆమె సాధించిన ఈ విజయం భారత మహిళా సాధికారతకు ప్రతీకగా మారింది. వైద్యురాలిగా ప్రారంభమైన ప్రయాణం అత్యున్నత సైనిక నాయకత్వ స్థాయికి చేరుకోవడం వెనుక దశాబ్దాల కృషి, అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం ఉన్నాయి. ఆమె విజయం వ్యక్తిగత ఘనత మాత్రమే కాకుండా రక్షణ రంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే ఆలోచనకు బలాన్నిచ్చింది. పద్మావతి బందోపాధ్యాయ పరిశోధనల పట్ల ఆసక్తి కలిగిన వైద్య నిపుణురాలు కూడా. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉండే అంటార్కిటికా ప్రాంతంలో భారత పరిశోధన కార్యక్రమాల్లో పాల్గొనడం ఆమె జీవితంలోని మరో విశేష ఘట్టం. తీవ్రమైన చలి, భౌగోళిక ప్రతికూలతలు, పరిమిత వసతుల మధ్య పరిశోధన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆమె సాహసస్ఫూర్తిని చాటిచెప్పింది. ఈ అనుభవం ఆమె వైద్య పరిశోధనలపై ఆసక్తిని, సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని మరింత స్పష్టంగా తెలియజేసింది. ఒకప్పుడు సైనిక రంగంలో మహిళల పాత్రకు అనేక పరిమితులు ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో పద్మావతి బందోపాధ్యాయ తన ప్రతిభతో ఒక్కో మెట్టు అధిరోహించారు. వృత్తిపరమైన అడ్డంకులను అధిగమిస్తూ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మహిళలు వైద్యం, పరిశోధన, సైనిక పరిపాలన, నాయకత్వం వంటి రంగాల్లో సమర్థంగా రాణించగలరని నిరూపించారు. ఆమె సాధించిన విజయాలు రక్షణ రంగంలో అడుగు పెట్టాలనుకునే యువతులకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం ఉంటే ఎంతటి ఉన్నత లక్ష్యాన్నైనా సాధించవచ్చనే సందేశాన్ని ఆమె జీవితం అందిస్తోంది. పద్మావతి బందోపాధ్యాయ ప్రస్థానం కేవలం హోదాలు, పురస్కారాల చరిత్ర కాదు. దేశానికి సేవ చేయాలన్న సంకల్పం ఒక వ్యక్తిని ఎంతటి ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలదో చెప్పే స్ఫూర్తిదాయక గాథ. విద్యార్థినులు, యువతులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయడానికి ఆమె జీవితం ఆదర్శంగా నిలుస్తోంది. భారత వైమానిక దళ చరిత్రలో పద్మావతి బందోపాధ్యాయ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. మహిళలు సాధించలేరని భావించిన ఉన్నత స్థానాలను అధిరోహించి, భావితరాలకు మార్గం చూపిన ధీరవనిత ఆమె. దేశ రక్షణ, వైద్య పరిశోధన, నాయకత్వ రంగాల్లో చేసిన సేవలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

కివీస్‌తో వన్డే సమరం.. నేడే తొలి పోరు!

- టీ20 సిరీస్ విజయంతో జోరుమీదున్న టీమిండియా
- ఆక్లాండ్ ఈడెన్ పార్క్‌లో భారత్-న్యూజిలాండ్ ఢీ
- జట్టులోకి రోహిత్, కోహ్లీ.. బ్యాటింగ్‌కు అదనపు బలం
- తొలి మూడు వన్డేలకు గిల్.. చివరి రెండింటికి అయ్యర్ సారథ్యం
- ఈడెన్ పార్క్‌లో భారత్‌కు సవాల్ విసురుతున్న గత రికార్డులు



ఆక్లాండ్, నవంబర్ 4 (చురకలు): పొట్టి క్రికెట్‌లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత జట్టు ఇప్పుడు వన్డే సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా అదే ఉత్సాహంతో వన్డే పోరులో అడుగుపెడుతోంది. భారత్, న్యూజిలాండ్ మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం ఆక్లాండ్‌లోని చారిత్రాత్మక ఈడెన్ పార్క్ మైదానంలో జరగనుంది. టీ20ల్లో సాధించిన విజయాన్ని వన్డేల్లోనూ కొనసాగించాలని భారత జట్టు భావిస్తుండగా, సొంతగడ్డపై సిరీస్‌కు శుభారంభం ఇవ్వాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రావడంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత బలపడింది. ఈ వన్డే సిరీస్‌లో భారత జట్టుకు ఇద్దరు కెప్టెన్లు వ్యవహరించనుండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. తొలి మూడు వన్డేలకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నారు. యువ ఆటగాళ్లతోపాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లు జట్టులో ఉండటంతో భారత్ సమతూకంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రాకతో బ్యాటింగ్ విభాగంపై అంచనాలు పెరిగాయి. ఆరంభంలో రోహిత్ దూకుడుగా ఆడితే, మధ్య ఓవర్లలో కోహ్లీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే అవకాశం ఉంటుంది. వీరిద్దరి అనుభవం న్యూజిలాండ్ పరిస్థితుల్లో భారత్‌కు కీలకం కానుంది. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ ప్రదర్శనపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారీ సిక్సర్లు బాదడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన రోహిత్ మరో మైలురాయికి చేరువలో ఉన్నాడు. న్యూజిలాండ్ గడ్డపై సెంచరీ సాధిస్తే వయసు పరంగా అరుదైన ఘనత అందుకునే అవకాశమూ ఉంది. అయితే వ్యక్తిగత రికార్డులకంటే జట్టు విజయమే ముఖ్యమని భారత అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు విరాట్ కోహ్లీ కూడా తన అనుభవంతో కీలక ఇన్నింగ్స్ ఆడాలని భావిస్తున్నాడు. తొలి మ్యాచ్‌కు వేదికైన ఈడెన్ పార్క్ మైదానంలో భారత్ గత రికార్డులు అంత ఆశాజనకంగా లేవు. ఇక్కడ ఇప్పటివరకు ఆడిన 11 వన్డేల్లో భారత్ నాలుగింట మాత్రమే విజయం సాధించగా, ఆరు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ నేపథ్యంలో పాత రికార్డులను అధిగమించి విజయంతో సిరీస్‌ను ప్రారంభించడం టీమిండియాకు సవాల్‌గా మారనుంది. న్యూజిలాండ్ మైదానాల్లో బంతి కదలిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటర్లు తమ ఆటతీరును మార్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో వికెట్లు కోల్పోకుండా నిలబడటం భారత విజయావకాశాలను ప్రభావితం చేయనుంది. మిచెల్ సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టును తక్కువ అంచనా వేయలేము. సొంత మైదానాలపై మంచి అవగాహన కలిగిన కివీస్ ఆటగాళ్లు భారత బ్యాటర్లకు గట్టి సవాల్ విసిరే అవకాశం ఉంది. టీ20 సిరీస్ ఓటమి తర్వాత వన్డేల్లో పుంజుకోవాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది. బౌలింగ్‌లో క్రమశిక్షణతోపాటు చురుకైన క్షేత్రరక్షణ న్యూజిలాండ్‌కు ప్రధాన బలాలు. భారత బ్యాటింగ్ విభాగాన్ని త్వరగా కట్టడి చేయడంపైనే ఆ జట్టు దృష్టి సారించనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరు రెండు జట్లకూ కీలకం కానుంది. ప్రారంభ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మిగిలిన పోరులకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది. భారత్‌కు సీనియర్ ఆటగాళ్ల అనుభవం అండగా ఉండగా, న్యూజిలాండ్‌కు సొంతగడ్డ పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు, భారత కాలమానం ప్రకారం ఉదయం 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఒకవైపు రోహిత్, కోహ్లీ అనుభవం.. మరోవైపు గిల్ యువ నాయకత్వం.. సొంతగడ్డపై సాంట్నర్ సేన సవాల్! తొలి వన్డేలో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



పంజాబ్ కింగ్స్ భారీ స్కెచ్

ముంబై నుంచి హార్దిక్ పాండ్యా కోసం ఆ ఇద్దరు ఆటగాళ్ల ట్రేడ్ డీల్!

ముంబై, నవంబర్ 3 (చురకలు): ఐపీఎల్ 2027 సీజన్ ప్రారంభానికి ముందే లీగ్‌లో ఓ భారీ సంచలనానికి తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ ఆటగాడు హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీ మారే దిశగా అడుగులు వేస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027కి ముందు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్‌తో తీవ్రస్థాయిలో ట్రేడ్ చర్చలు జరుపుతున్నట్లు ప్రముఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంచలన ట్రేడ్ డీల్‌లో భాగంగా హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు పంజాబ్ కింగ్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ వికెట్ కీపర్-బ్యాటర్ విష్ణు వినోద్‌లను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చే ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ముంబై జట్టు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు పంజాబ్ టాప్ వికెట్ టేకర్ అర్ష్‌దీప్‌ను తీసుకోవడానికి ముంబై మేనేజ్‌మెంట్ కూడా సుముఖంగా ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. పంజాబ్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఈ ట్రేడ్ చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇరు జట్ల సీనియర్ మేనేజ్‌మెంట్లు ఈ ఒప్పందానికి దాదాపు అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి వస్తే మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌తో పాటు డెత్ ఓవర్ల బౌలింగ్‌లో జట్టుకు అపారమైన బలం చేకూరుతుంది. అయితే ప్రధాన బౌలర్ అర్ష్‌దీప్‌ను కోల్పోవడం పంజాబ్ పేస్ విభాగానికి కొంత లోటే అయినప్పటికీ, ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను సమర్థవంతంగా వాడుకునే వ్యూహంతో పంజాబ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ గడువు నవంబర్ 17 కావడంతో, ఈ డీల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను ఐపీఎల్ వర్గాలు ఈ వారంలోనే వెల్లడించే అవకాశాలు ఉన్నాయని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వార్తపై ఇరు ఫ్రాంచైజీల నుంచి ఇంకా అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది.

కాలికి గాయమైనా వీరోచిత పోరాటం

- 128 బంతుల్లో అజేయంగా 201 పరుగులు.. 21 ఫోర్లు, 10 సిక్సర్లతో విధ్వంసం
- అఫ్గానిస్థాన్‌పై వాంఖడే మైదానంలో అసాధారణ పోరాటం
- అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు నేపథ్యంలో మళ్లీ చర్చకు వచ్చిన చారిత్రక ద్విశతకం



మెల్‌బోర్న్, నవంబర్ 3 (చురకలు) : మైదానంలో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 38 ఏళ్ల వయసులో మాక్స్‌వెల్ సంచలన రీతిలో తీసుకున్న ఈ రిటైర్మెంట్ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానికి 2028 టీ20 వరల్డ్ కప్, లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియా తరఫున ప్రతినిధ్యం వహించాలని ఆయన భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిశ్చయించుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేని ఆయన వీరోచిత ఇన్నింగ్స్ గురించి సోషల్ మీడియాలో క్రీడాభిమానులు ఘనంగా స్మరించుకుంటున్నారు. ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియం వేదికగా 2023 వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన పోరు వన్డే చరిత్రలోనే అత్యుత్తమ మ్యాచ్‌గా నిలిచింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కేవలం 91 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్ తీవ్రమైన కండరాల నొప్పులు (క్రాంప్స్), కాలి గాయంతో నడవలేని పరిస్థితి ఏర్పడినప్పటికీ మైదానంలో పట్టుదలతో నిలబడి అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 128 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 201 పరుగులు చేసి అజేయంగా నిలిచి ఆసీస్‌కు 3 వికెట్ల తేడాతో విస్మయకర విజయాన్ని అందించారు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్ తోడ్పాటుతోనే ఆస్ట్రేలియా ఆ ఏడాది వరల్డ్ కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌లోని 3 ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశారు. టెస్టుల్లో 7 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీతో 339 పరుగులు చేయగా, 8 వికెట్లు పడగొట్టారు. ఇక 149 వన్డేల్లో 126.70 స్ట్రైక్ రేట్‌తో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలతో 3990 పరుగులు సాధించడంతో పాటు 77 వికెట్లు తీశారు. 2015, 2023 వన్డే వరల్డ్ కప్‌లు గెలిచిన ఆసీస్ జట్టులో ఆయన అత్యంత కీలక పాత్ర పోషించారు. 130 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 154.42 స్ట్రైక్ రేట్‌తో 5 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీల సాయంతో 2897 పరుగులు చేయడంతో పాటు 51 వికెట్లు తీశారు. అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ వివిధ దేశాల ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో ఆయన కొనసాగుతారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.



డయానా గ్రేస్‌కు 3 పతకాలు

హైదరాబాద్: సీబీఎస్ఈ జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ డయానా గ్రేస్ అద్భుత ప్రదర్శనతో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలను సాధించింది. పుణెలో జరిగిన ఈ టోర్నీ అండర్-19 విభాగంలో పోటీపడిన డయానా (కార్నర్‌స్టోన్ స్కూల్) ఇండివిజువల్ ఆపరేటస్ బీమ్ ఈవెంట్‌లో 9.45 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్ (7.25), ఆల్‌రౌండ్ (34.05) విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను ఖాతాలో వేసుకుంది.

కొరియా ఓపెన్‌కు లక్ష్యసేన్ దూరం



యోసు (సౌత్ కొరియా): రెండ్రోజుల క్రితం ముగిసిన హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెన్స్ సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్.. మంగళవారం నుంచి దక్షిణ కొరియాలో మొదలుకానున్న బీడబ్ల్యూఎఫ్ కొరియా సూపర్ 500 టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. ఐదో సీడ్‌గా ఉన్న అతడు తప్పుకోవడంతో ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలన్నీ సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ పై ఉన్నాయి. తొలిరౌండ్‌లో అతడు లోకల్ ప్లేయర్ యొ టెబిన్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక కూడా టోర్నీకి దూరమైంది. అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ విమెన్స్ సింగిల్స్ బరిలో ఉన్నారు. కొరియా ఓపెన్‌తో పాటు జపాన్ మాస్టర్స్ నుంచి సింధు ముందే తప్పుకుంది.

అజేయంగా సెమీస్‌కు..

భారత్ ఖాతాలో ఐదో విజయం



జలంధర్: సొంతగడ్డపై జరుగుతున్న హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న భారత జట్టు ఖాతాలో మరో విజయం. లీగ్ దశలో భాగంగా సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్.. 8-0తో దక్షిణ కొరియాను చిత్తుచేసి అజేయంగా సెమీస్‌కు చేరుకుంది. గ్రూప్ దశలో మొదట బంగ్లాదేశ్‌పై 13-0తో టైటిల్ వేటను ఆరంభించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ తర్వాత చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదుచేసింది. కొరియాతో పోరులో స్ట్రైకర్ దిల్‌ప్రీత్ సింగ్ (8, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా జుగ్‌రాజ్ సింగ్ (11), హర్మన్‌ప్రీత్‌సింగ్ (15), షీలానంద్ (33), సుఖ్‌జీత్ (34), సంజయ్ (36), అంగద్ (60) చెరో గోల్స్‌తో చెలరేగారు. లీగ్ స్టేజ్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ గెలిచిన భారత్.. పాయింట్ల పట్టికలో 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం జరుగబోయే రెండో సెమీస్‌లో కొ రియాతోనే భారత్ నాకౌట్ మ్యాచ్ ఆడనుంది.



‘రామాయణ’కు పైరసీ భయం

కీలక ఆదేశాలు జారీ చేసిన ముంబై హైకోర్టు!

ముంబై, నవంబర్ 3 (చురకలు): భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం ‘రామాయణ’. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన దృశ్యాలు, వీడియో క్లిప్పులు బయటకు రాకుండా నిర్మాతలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాలకు పైరసీ పెద్ద సమస్యగా మారుతోంది. థియేటర్లలో విడుదలకు ముందే సినిమా దృశ్యాలు, పాటలు, కీలక సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో లీక్ అయితే చిత్ర బృందానికి నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను ముందుగానే అడ్డుకునేందుకు ‘రామాయణ’ నిర్మాతలు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముంబై హైకోర్టు సినిమా పైరసీ, అనధికారిక వీడియో క్లిప్పుల ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా డైనమిక్ ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. సినిమా పేరుతో అనధికారికంగా లింకులు, వీడియోలు, క్లిప్పులు అప్‌లోడ్ చేసే వెబ్‌సైట్లు, ఇతర వేదికలపై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు ఉపయోగపడనున్నాయి. డిసెంబర్ మధ్య వరకు ‘రామాయణ’కు సంబంధించిన పైరసీ లింకులు, అనధికారిక కంటెంట్ వ్యాప్తిని నియంత్రించేందుకు ఈ ఆదేశాలు తోడ్పడనున్నాయి. భారీ పెట్టుబడితో రూపొందుతున్న సినిమాను పైరసీ నుంచి రక్షించుకోవడంలో నిర్మాతలు తీసుకున్న ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘రామాయణ’లో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ యష్ రావణుడి పాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు ఒకే చిత్రంలో భాగం కావడంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌తో పాటు ప్రముఖ హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. భారతీయ పురాణ గాథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేసేలా భారీ సాంకేతిక హంగులతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యష్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు..



ఇకపై ఆచితూచి మాట్లాడుతా..

నా మాటల భావనలో లోపాలను సరిదిద్దుకుంటా: నటి సాయిపల్లవి!

హైదరాబాద్, నవంబర్ 3 (చురకలు) : తన సహజ నటనతో అశేష ప్రేక్షకాభిమానులను సొంతం చేసుకున్న ప్రముఖ కథానాయిక సాయిపల్లవి తన ప్రసంగాలు, మాటల శైలిపై కీలక ప్రకటన చేశారు. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ ‘ఫిదా’, ‘లవ్ స్టోరీ’, ‘శ్యామ్ సింగరాయ్’, ‘విరాటపర్వం’, ‘తండేల్’ వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, గతంలో పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు వివాదాలకు దారితీసిన విషయం తెలిసిందే. ‘విరాటపర్వం’ ప్రమోషన్లలో కశ్మీరీ పండిట్ల అంశం, భారత సైన్యంపై చేసిన పాత వ్యాఖ్యలు, అలాగే ఇటీవల ‘రామాయణ’ చిత్రంలో రావణుడి పాత్రపై ఆమె చేసిన తాత్విక కామెంట్స్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సాయిపల్లవి.. ఇకపై తాను ప్రతి మాటను ఆచితూచి మాట్లాడతానని స్పష్టం చేశారు. తన మనసులో ఉన్న భావాలను ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పడంలో తనకు కొంత ఇబ్బంది ఉందని, మాటల రూపంలో సరిగ్గా వ్యక్తపరచలేకపోవడం వల్ల తాను చెప్పాలనుకున్న దానికి భిన్నమైన అర్థాలు వస్తున్నాయని నిజాయితీగా అంగీకరించారు. ఒక నటిగా తనకు లభించే గుర్తింపు కారణంగా ప్రతి మాటకు సమాజంలో పెద్ద ఎత్తున ప్రచారం లభిస్తుందని, అందువల్ల ఇకపై మాట్లాడే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. తన భావాలను సరిగ్గా వ్యక్తపరిచే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటానని చెప్పిన ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం ఫిలిం వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

తెల్లగా ఉంటే చాలు.. తెలుగు అక్కర్లేదు

టాలీవుడ్ పరిస్థితిపై రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు!



హైదరాబాద్, నవంబర్ 3 (చురకలు) : బాలీవుడ్ నటి రాధికా ఆప్టే తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హీరోయిన్ల ఎంపిక, కథాంశాల తీరుపై చేసిన సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. తెల్లగా ఉంటే చాలు, తెలుగు భాష రాకపోయినా, భాషతో సంబంధం లేకుండా హీరోయిన్లుగా తీసేసుకుంటారనే కోణంలో టాలీవుడ్ పరిస్థితులపై ఆమె అసహనం వ్యక్తం చేసిన తీరు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కీర్తి సురేష్‌తో కలిసి నటించిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ ‘అక్కా’ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, తన గత తెలుగు సినిమాల అనుభవాలను గుర్తుచేసుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలుగులో తాను నటించిన ఓ సినిమాలో తనకంటే చాలా పెద్ద వయసున్న నటుడితో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని, అంతేకాకుండా సొంత మేనబావను పెళ్లి చేసుకునే సన్నివేశాలు ఉన్నాయని చెప్పారు. అంతటితో ఆగకుండా సినిమా మధ్యలోనే తన పాత్రను చంపేశారంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె నేరుగా సినిమా పేరును వెల్లడించనప్పటికీ, ఈ వ్యాఖ్యలు నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ‘లెజెండ్’ (2014) సినిమాను ఉద్దేశించినవేనని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఆ చిత్రంలో రాధికా ఆప్టే బాలకృష్ణకు మరదలి పాత్రలో నటించగా, కథలోని ఫ్లాష్‌బ్యాక్‌లోనే ఆమె పాత్ర హత్యకు గురవుతుంది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు, నందమూరి అభిమానులు ఆమెకు ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. కథ, పాత్ర స్వభావం నచ్చనప్పుడు సినిమాను అంగీకరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. అడ్వాన్స్ తీసుకుని సైన్ చేసేటప్పుడే ఇవన్నీ తెలుస్తాయి కదా అని నిలదీస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మేనరికపు వివాహాలు సంప్రదాయంలో భాగమని, స్థానిక సంస్కృతులను కథల్లో చూపించడం సహజమని స్పష్టం చేస్తున్నారు. ప్రతిదాన్ని విమర్శించడం సరికాదని కొందరు కౌంటర్ ఇస్తుంటే, మహిళా పాత్రల ప్రాధాన్యతపై నటీమణులు తమ అభిప్రాయాలు చెప్పడంలో తప్పులేదని మరికొందరు సపోర్ట్ చేస్తున్నారు.



నాగార్జున 100వ సినిమాలో టబు స్పెషల్ రోల్

హైదరాబాద్, నవంబర్ 3 (చురకలు) : కింగ్ నాగార్జున, అందాల నటి టబు కాంబినేషన్‌కు తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన ‘నిన్నే పెళ్లాడతా’ చిత్రం అప్పట్లో పరిశ్రమ రికార్డులను తిరగరాయడమే కాకుండా, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీకి టాలీవుడ్‌లో తిరుగులేని ఆదరణ లభించింది. చాలా కాలం తర్వాత ఈ క్రేజీ ఐకానిక్ జోడీ మరోసారి వెండితెరపై కలిసి కనిపిస్తుండటంతో సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. నాగార్జున నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 100వ మైలురాయి చిత్రం ‘కింగ్ 100’ లో టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులు మరోసారి ఈ అరుదైన జోడీని తెరపై చూడబోతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా చిత్ర బృందం టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను నవంబర్ 4న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ ప్రకటనతో అక్కినేని అభిమానుల్లో మరింత ఉత్సాహం నిండింది. ఆర్. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. నాగార్జున కెరీర్‌లో ఇది 100వ మైలురాయి చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దశాబ్దాల తర్వాత నాగార్జున, టబు జోడీ మళ్లీ కలవడం, అది కూడా 100వ సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com